చట్టబద్ధత లేని ఎంవోయూలు

- ప్రభుత్వంతో విలువలేని ఒప్పందాలు
- కంపెనీలు పెట్టేవరకూ అనుమానమే

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): ఒప్పందాలు కార్యరూపం దాల్చితే రాష్ట్రానికి మేలేదావోస్ సదస్సులో ప్రభుత్వంతో కంపెనీలు చేసుకుంటున్న ఎంవోయూలకు ఎటువంటి చట్టబద్ధత లేదు. ఇవి ఇరుపక్షాలు పరస్పర అవగాహనతో చేసుకునే ఒప్పందాలు మాత్రమే. కంపెనీలు పెట్టుబడి పెట్టకుండా వెనక్కుపోయినా ప్రభుత్వం వారిపై ఎటువంటి చర్యలు తీసుకునే అధికారం ఉండదు. ఈ పెట్టుబడులన్నీ కార్యరూపం దాల్చితే రాష్ట్రానికి మేలు జరుగుతుందనడంలో సందేహం లేదు. పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం రావడమే కాకుండా నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అయితే, ఈ ఎంవోయూలు ఎంతవరకు కార్యరూపం దాల్చుతాయనేదే సందేహం. సహజంగా ఒక కంపెనీ పెట్టాలంటే ముందుగా భూమికోసం టీఎస్ఐఐసీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుతోపాటు ప్రాజెక్టు నివేదిక సమర్పిస్తే వివిధ శాఖల అధికారులతో కూడిన కమిటీ సమావేశమై దీనిపై నిర్ణయం తీసుకుంటుంది. దరఖాస్తు, ప్రాజెక్టు నివేదిక, ఆర్థికపరమైన అంశాలు సవ్యంగా ఉంటే ఆమోదం లభిస్తుంది. అనంతరం నిర్ణీత ధరను చెల్లించిన తరువాత భూ కేటాయింపు జరుగుతుంది. ఆ తరువాత కంపెనీ ఏర్పాటు చేసి సంవత్సరం, లేక రెండేండ్ల (కంపెనీ సామర్థ్యాన్నిబట్టి) ఉత్పత్తి ప్రారంభించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో భూ కేటాయింపు రద్దవుతుంది. రూ.500 కోట్లకుపైగా పెట్టుబడితో కూడిన మెగా ప్రాజెక్టులైతే ప్రభుత్వం క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటుంది. చాలా సంస్థలు ఎంవోయూలకు చూపిన ఉత్సాహం కంపెనీ ఏర్పాటుపై చూపడంలేదనే విమర్శలున్నాయి. హడావుడిగా పెట్టుబడులు ప్రకటించి, ప్రభుత్వంతో ఎంవోయూలు కుదుర్చుకొని అనంతరం పలు కారణాలతో వెనక్కు పోతుంటాయి. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఎంవోయూలన్నీ పెట్టుబడులుగా చెప్పేందుకు అవకాశం లేదు.

కేసీఆర్ హయాంలో వాస్తవరూపం దాల్చిన ఎంవోయూలు

రాష్ట్ర ప్రభుత్వంతో కంపెనీల ఎంవోయూలు వాస్తవరూపం దాల్చితే రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుంది. పారిశ్రామికంగా రాష్ట్రం అభివృద్ధి చెందడంతోపాటు ఉద్యోగావకాశాలు మెరుగవుతాయి. రాష్ట్రానికి ఆదాయం సమకూరుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రపంచ దిగ్గజ కంపెనీ ఫాక్స్‌కాన్ అప్పటి సీఎం కేసీఆర్‌తో సమావేశమై రాష్ట్రంలో సుమారు రూ.500 మిలియన్ డాలర్ల పెట్టుబడికి ఒప్పందం చేసుకున్నది. ఒప్పందం ప్రకారం ప్రభుత్వం భూమి కేటాయించడం, కంపెనీ ఏర్పాటు పనులు చకచకా జరిగిపోయాయి. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో కిటెక్స్ సంస్థ సైతం సుమారు రూ.1500 కోట్ల పెట్టుబడికి రెండేండ్ల క్రితం ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొని వెంటనే కంపెనీ ఏర్పాటు పనులు ప్రారంభించింది. వచ్చే మార్చిలోగా కంపెనీ ఉత్పత్తి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నది. ఇదే కంపెనీ సీతారాంపూర్‌లో సైతం మరో యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ఒప్పందం చేసుకున్నది. అక్కడ కూడా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. కేసీఆర్ ప్రభుత్వం కంపెనీలతో ఒప్పందాలు చేసుకోవడంతోపాటు వాటిని వాస్తవరూపం దాల్చే విధంగా కృషిచేసింది.

ఎంవోయూ ఒప్పందం కాదు

ఉమ్మడి లక్ష్యంతో రెండు లేక అంతకన్నా ఎక్కువ పక్షాలు కలిసి పనిచేసేందుకు అంగీకరిస్తూ సంతకాలు చేస్తే దాన్ని ఒప్పందంగా చెప్పవచ్చు. దీనికి చట్టబద్ధత ఉంటుంది. ఏ పక్షమైనా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే న్యాయస్థానానికి వెళ్లి నష్ట పరిహారం కోరవచ్చు. ఒప్పంద పత్రంలో నియమ నిబంధనలు సమగ్రంగా, క్షుణ్ణంగా ఉంటాయి కాబట్టి ఏ ఒక్క పక్షమూ సహేతుకమైన కారణం లేకుండా ఒప్పందం నుంచి వెనక్కు వెళ్లే అవకాశం ఉండదు. ఎంవోయూ ఇరు పక్షాలు పరస్పర అవగాహనతో సూత్రప్రాయంగా కుదుర్చుకునే ఒప్పందం మాత్రమే. దీనికి కచ్చితమైన నియమ నిబంధనలు ఏవీ ఉండవు. దీనికి చెల్లుబాటు ఉండదు. న్యాయస్థానంలో సవాల్ చేసే వీలు కూడా ఉండదు.

దావోస్‌లో ఎంవోయూలు

మొదటిపేజీ తరువాయి...

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సు జరుగుతున్న విషయం విదితమే. సీఎం నేతృత్వంలోని బృందం రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ సమావేశాల్లో కృషిచేస్తున్నది.

- అదానీ గ్రూప్ రాష్ట్రంలో వివిధ రంగాల్లో రూ.12,400 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. సీఎం రేవంత్‌తో అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ సమావేశమైన అనంతరం రూ.12,400 కోట్ల పెట్టుబడులకు సంబంధించి గౌతమ్ అదానీ, ఏరోస్పేస్, డిఫెన్స్ సీఈవో ఆశీష్‌రాజ్ వంశీ అవగాహనా ఒప్పందాలపై సంతకాలు చేశారు. తెలంగాణలో పెట్టుబడులతోపాటు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు గౌతం అదానీ సంసిద్ధత వ్యక్తపరిచారు. త్వరలోనే అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ స్కిల్లింగ్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని, పూర్తి వివరాలను త్వరలో ప్రకటిస్తామని అదానీ తెలిపారు.
- జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ అనుబంధ సంస్థ జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ తెలంగాణలో రూ.9,000 కోట్ల పెట్టుబడితో 1,500 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యంగల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఆ సంస్థ ఈ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. సీఎం రేవంత్‌తో జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ సమావేశమైన అనంతరం ఈ మేరకు ఒప్పందం చేసుకున్నారు.
- తెలంగాణలో ఔషధాల ఆవిష్కరణ, అభివృద్ధి సేవలను విస్తరించేందుకు ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ సంసిద్ధత వ్యక్తంచేసింది. ఇందులో భాగంగా రూ.2,000 కోట్ల కొత్త పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొన్నది.
- గోడి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తెలంగాణలో రూ.8,000 కోట్ల పెట్టుబడితో ఆర్ అండ్ డీతోపాటు గిగా స్కేల్ బ్యాటరీ సెల్ తయారీ కేంద్రాన్ని నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నది. సీఎం రేవంత్‌తో గోడి ఇండియా కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో మహేష్ గోడి సమావేశమయ్యారు.
- తెలంగాణలో రూ.5,200 కోట్లతో డాటా సెంటర్లను నెలకొల్పేందుకు వెబ్‌వర్క్స్ ముందుకొచ్చింది. డాటా సెంటర్ల నిర్వహణలో అగ్రగామి సంస్థల్లో ఒకట్టైన ఐరన్ మౌంటేన్ అనుబంధ సంస్థ వెబ్‌వర్క్స్. ఐరన్ మౌంటేన్ సీఈవో విలియం మీనీ, వెబ్‌వర్క్స్ సీఈవో నిఖిల్ రాఠీ.. సీఎం రేవంత్ తో సమావేశమై తెలంగాణలో డాటా సెంటర్ల ఏర్పాటు, నిర్వహణపై చర్చలు జరిపారు.
- సీఎం రేవంత్‌రెడ్డితో గోడ్రెజ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నాదిర్ గోద్రెజ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో రూ.1,000 కోట్లతో కెమికల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్‌కు జ్ఞాపిక అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

కంపెనీల పెట్టుబడి ఎంవోయూల వివరాలు

సంస్థ	పెట్టుబడి ఒప్పందం (రూ.కోట్లలో)
అదానీ గ్రూప్	12,400
ఆరాజెన్	2,000
జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ	9,000
గోడి ఇండియా	8,000
వెబ్ వర్క్స్	5,200
గోద్రెజ్	1,000

సీఎం రేవంత్‌తో సీఐఐ ప్రతినిధుల భేటీ

భారత పరిశ్రమల సమాఖ్య తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం పలు కంపెనీలకు చెందిన సీఈవోలు దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు వారు చేస్తున్న కృషిని అభినందించారు. రాష్ట్రాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని సీఎంకు భరోసా ఇచ్చారు. సీఐఐ చైర్మన్ శేఖర్‌రెడ్డితోపాటు వివిధ కంపెనీల సీఈవోలు సీఎంను కలిసినవారిలో ఉన్నారు.

నాడు ఆరోపణలు.. నేడు ఒప్పందాలు

- అదానీపై దుమ్మెత్తిపోసిన రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి
- ఇప్పుడు దావోస్‌లో అదే అదానీతో ఒప్పందాలు
- సోషల్ మీడియాలో పేలుతున్న సెటైర్లు

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): 'ఇద్దరు గుజరాతీలు దేశాన్ని అమ్ముతుంటే..మరో ఇద్దరు గుజరాతీలు కొంటున్నారు, ప్రధాని మోదీ దేశ సంపదను అదానీకి దోచి పెడుతున్నారు'.. ఇవీ ప్రముఖ వ్యాపారవేత్త అదానీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పలు సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా గతంలో అదానీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి అదానీకి రెడ్ కార్పొరేట్ వేశారు. దావోస్‌లో జరుగుతున్న వ్యాపార సదస్సులో అదానీతో భేటీ అయిన సీఎం రేవంత్ పలు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వారిద్దరి భేటీపై సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి. 'అప్పుడేమో మీ అగ్రనేతతో పాటు మీరు అదానీపై ఆరోపణలు చేస్తారు.. ఇప్పుడేమో ఒప్పందాలు చేసుకుంటారా?' అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అదానీపై రాహుల్‌గాంధీ ఆరోపణలు అపాలని డిమాండ్ చేస్తున్నారు. మరికొందరేమో రాజకీయం వేరు.. పరిపాలన వేరు అని సమర్థిస్తున్నారు. ఒకవేళ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా రాహుల్ గాంధీ అదే అదానీతో ఒప్పందాలు చేసుకుంటారని సెటైర్లు వేస్తున్నారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలకు ప్రతిపాదనలు వద్దు

- రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్‌భవన్ నుంచి సమాచారం

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): గవర్నర్ కోటాలో భర్తీ చేయాల్సిన ఎమ్మెల్సీలపై రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. తన కోటాలో ఎమ్మెల్సీల భర్తీకి ప్రతిపాదనలు పంపించవద్దని గవర్నర్ తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం పంపించినట్టు రాజ్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. ఎమ్మెల్సీల భర్తీకి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనలను గవర్నర్ తిరస్కరించిన విషయం తెలిసిందే. అయితే గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ గత ప్రభుత్వం గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా ప్రతిపాదించిన దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుపై ఈ నెల 24న హైకోర్టులో విచారణ జరుగనున్నది. ఈ నేపథ్యంలో గవర్నర్ కోటాలో ప్రతిపాదనలు స్వీకరించరాదని నిర్ణయించినట్టు రాజ్‌భవన్ వర్గాలు పేర్కొన్నాయి. గవర్నర్ నిర్ణయం ఎమ్మెల్సీ పదవులు ఆశిస్తున్న వారిని షాక్‌కు గురిచేసింది. గవర్నర్ తమిళిసై తీసుకున్న నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందన్నది చర్చనీయాంశమైంది.

అన్‌ఫిట్‌కు.. మోసగాళ్లను నమ్మొద్దు

- సింగరేణి కార్మికులకు సీఎండీ బలరామ్ సూచన

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): సింగరేణి ఉద్యోగుల నిమిత్తం మెడికల్ బోర్డును అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోసగాళ్లు డబ్బు తీసుకొని అన్‌ఫిట్ చేయిస్తామని ప్రలోభపెడితే వారిని నమ్మొద్దని చెప్పారు. అన్‌ఫిట్ అయిన వారి స్థానంలో ఇప్పటికే సుమారు 16,000 మంది వారసులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. మోసగాళ్ల సమాచారాన్ని విజిలెన్స్ దృష్టికి తీసుకొస్తే.. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ డ్రైవర్ల ఆందోళనకు మద్దతుగా మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

'హిట్ అండ్ రన్'కు వ్యతిరేకంగా నిరసనలు

జైనూర్, జనవరి 17: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టానికి సవరణ చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా డ్రైవర్ల ఆందోళనలు కొనసాగుతున్నాయి. నిర్మల్ జిల్లా కేంద్రంలో లారీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ ప్రధాన రహదారిపై డ్రైవర్లు రాస్తారోకో నిర్వహించగా, ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ఇలాంటి చట్టాలతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడే అవకాశమున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కేంద్రం పునరాలోచించాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆదిలాబాద్‌లోనూ లారీ యజమానులు, డ్రైవర్లు కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ఆ తరువాత ధర్నా చేసి, కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

శ్రీశైలం, సాగర్ సమర్పయామి!

మొదటిపేజీ తరువాయి...

ఉండాలి. అయితే నిరుడు నవంబర్ 29న ఏపీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా సాగర్ డ్యామ్‌ను అక్రమించిన నేపథ్యంలో రెండు రాష్ట్రాల అధికారులతో కేంద్ర జల్‌శక్తిశాఖ కార్యదర్శి దేబ్‌శ్రీ ముఖర్జీ బుధవారం న్యూఢిల్లీలోని శ్రమశక్తిభవన్‌లో ప్రత్యేక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. శ్రీశైలం, సాగర్ డ్యామ్‌లతోపాటు, వాటికి సంబంధించిన 15 ఔట్‌లెట్లు, ఆస్తులు, ఉద్యోగులతో సహా బోర్డుకు అప్పగించాలని ఇరు రాష్ట్రాలను ఆదేశించారు. దీనిపై ఇరురాష్ట్రాలు తమ వాదనలను వినిపించాయి.

ప్రభుత్వానికి నివేదించాకే..

కేంద్ర జల్‌శక్తిశాఖ ప్రతిపాదనలను తెలంగాణ రాష్ట్ర సాగునీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా తీవ్రంగా వ్యతిరేకించారు. ఏపీ స్వాధీనంలో ఉన్న సాగర్ కుడికాలువను తొలుత తెలంగాణకు అప్పగించి, పూర్వస్థితిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల అప్పగింత అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాకే తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని కేంద్రానికి స్పష్టం చేశారు. ట్రిబ్యునల్ అవార్డు వచ్చే వరకూ కృష్ణా జలాలను 50:50 నిష్పత్తిలో వినియోగించుకుంటామని, క్యారీ ఓవర్‌కు అవకాశమివ్వాలని, శ్రీశైలం ఎండీడీఎల్‌ను 834 ఫీట్లుగా నిర్ణయించాలని, పోతిరెడ్డిపాడు ద్వారా 34 టీఎంసీలను మాత్రమే వినియోగించుకునేలా ఏపీని కట్టడి చేయాలని తెలంగాణ ఎంతో కాలం నుంచి కోరుతున్నదని గుర్తుచేశారు. ఈ అంశాలన్నింటినీపై కేంద్రం నుంచి స్పష్టత వచ్చాకే ప్రాజెక్టుల అప్పగింత అంశంపై ఆలోచిస్తామని తేల్చిచెప్పారు. ప్రాజెక్టుల ఆపరేషన్ ప్రొటోకాల్, రూల్‌కర్వ్‌లు కొలిక్కి వచ్చిన తర్వాతే ప్రాజెక్టుల అప్పగింత సాధ్యమని స్పష్టం చేశారు. కాగా, కేంద్ర జల్‌శక్తిశాఖ ప్రతిపాదనలకు ఏపీ సర్కారు అంగీకరించింది. రివర్ బోర్డుల గెజిట్ ప్రకారం ప్రాజెక్టులను అప్పగించేందుకు తమ ప్రభుత్వం ఇప్పటికే జీవోను జారీ చేసిందని, ప్రాజెక్టులను అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నామని ఏపీ అధికారులు తెలిపారు.

ప్రాజెక్టుల స్వాధీనానికి కేంద్రం నిర్ణయం

రెండు రాష్ట్రాల అభిప్రాయాలను విన్న అనంతరం ప్రాజెక్టులను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని కేంద్ర జల్‌శక్తిశాఖ నిర్ణయించింది. సాగర్ డ్యామ్‌ను తిరిగి తెలంగాణకు అప్పగించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను తోసిపుచ్చింది. రెండు ప్రాజెక్టులను బోర్డుకే అప్పగించాలని నిర్ణయించాక మళ్లీ తెలంగాణకు అప్పగించడమేంటని ప్రశ్నించింది. ప్రాజెక్టుల అప్పగింతపై ఏమైనా అభ్యంతరాలు, అభిప్రాయాలు ఉంటే నివేదించాలని, వాటిపై చర్చించి పరిష్కరిస్తామని కేంద్రం తెలిపింది. ఏదేమైనా ప్రాజెక్టులను మాత్రం అప్పగించాల్సిందేనని తేల్చిచెప్పినట్టు సమాచారం. విద్యుత్తు ప్రాజెక్టులు, ఔట్‌లెట్లు, సాంకేతిక పరిమితుల్లో ఏవి ఎవరి పరిధిలో ఉండాలన్న దానిపై ఇరు రాష్ట్రాల సీఈలు చర్చించుకుని నిర్ణయానికి రావాలని, ప్రస్తుతం సీఆర్పీఎఫ్ కొనసాగిస్తున్న పెట్రోలింగ్‌ను యథాతథంగా ఉంచాలని దేబ్‌శ్రీ ముఖర్జీ తెలిపారు. సాంకేతిక అంశాలపై ఇరు రాష్ట్రాలు ఏకాభిప్రాయతో నివేదిక పంపిన తర్వాత మరోసారి భేటీ ఉంటుందని దేబ్‌శ్రీ ముఖర్జీ స్పష్టం చేసినట్టు అధికారులు వెల్లడించారు. సమావేశంలో తెలంగాణ తరపున రాహుల్ బొజ్జాతోపాటు, ఈఎన్సీ మురళీధర్, అంతరాష్ట్ర జలమండలి అధికారులు కోటేశ్వర్‌రావు, శ్రీధర్‌రావు దేశ్‌పాండే, సల్లా విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

తెలంగాణ జల హక్కులకు తీవ్ర విఘాతం

శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులను కేంద్రానికి స్వాధీనం చేస్తే తెలంగాణ జల హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుంది. ఈ నేపథ్యంలోనే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల అప్పగింతను తీవ్రంగా వ్యతిరేకించింది. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల నిర్వహణకు సీడబ్ల్యూసీ రూపొందించిన రూల్‌కర్వ్, ఆపరేషన్ ప్రొటోకాల్‌పై రిజర్వాయర్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఆర్ఎంసీ) చేసిన సిఫారసులను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోబోమని గతంలో అనేకసార్లు తేల్చిచెప్పింది. ఈ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి చేసిన జల విద్యుత్తును ఇరు రాష్ట్రాలు 50:50 నిష్పత్తిలో పంచుకోవాలన్న ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రాజెక్టుల రూల్‌కర్వ్స్ ట్రిబ్యునల్ అవార్డులకు అనుగుణంగా ఉండాలని, అందుకు విరుద్ధంగా రూపొందించే రూల్‌కర్వ్స్ ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పలు మార్లు స్పష్టం చేసింది. శ్రీశైలం నుంచి 34 టీఎంసీలను మాత్రమే వినియోగించుకునేందుకు ఏపీకి అనుమతివ్వాలని ఆది నుంచీ డిమాండ్ చేస్తున్నది. ప్రాజెక్టులన్నీ నిండిన తరువాత వృథాగా దిగువకు పోకుండా మళ్లించుకునే మిగులు జలాలను లెక్కించవద్దన్న ఆర్ఎంసీ ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. కృష్ణా నది నుంచి మళ్లించే ప్రతి నీటి చుక్కనూ లెక్కించాల్సిందేనని కరాఖండిగా తేల్చి చెప్పింది. నీటిని మళ్లింపు, నిల్వ సామర్థ్యం ఏపీకి చాలా ఎక్కువగా ఉన్నందున స్పిల్ ఓవర్ సమయంలో మళ్లించిన నీటిని కూడా ఏపీ వాటా కింద లెక్కించాలని, లేకుంటే మళ్లీ ఉమ్మడి స్టోరేజీల నుంచి నీటిని కోరుతూ ఏపీ అధిక మొత్తంలో జలాలను వినియోగించుకునే అవకాశమున్నదని అభ్యంతరాలను వ్యక్తం చేసింది. కృష్ణా జలాలను 50:50 నిష్పత్తిలోనే వినియోగించుకుంటామని పదే పదే పునరుద్ఘాటించడంతోపాటు ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం క్యారీ ఓవర్ స్టోరేజీకి అవకాశం కల్పించాలని పట్టుబడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలోనే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్ఎంసీ నివేదికపై సంతకం కూడా చేయలేదు. కానీ, ఆయా అంశాలపై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత రాకపోయినప్పటికీ ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టుల అప్పగింతకు అంగీకరించడం గమనార్హం. దీంతో తెలంగాణ జల హక్కులకు తీవ్ర విఘాతం కలగడం ఖాయంగా కనిపిస్తున్నది.

కేంద్రం స్వాధీనం చేసుకునేందుకు ప్రతిపాదించిన 15 ప్రాజెక్టులు

శ్రీశైలం ప్రాజెక్టు పరిధిలోనివి	అప్పగించాల్సిన రాష్ట్రం
1) శ్రీశైలం ప్రాజెక్టు స్పిల్‌వే	ఏపీ
2) కుడి విద్యుత్తు కేంద్రం	ఏపీ జెన్‌కో
3) పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్, శ్రీశైలం కుడి ప్రధాన కాలువ	ఏపీ
4) హెచ్ఎన్ఎస్ పంప్‌హౌస్, ఇతర నిర్మాణాలు	ఏపీ
5) ముచ్చుమర్రి లిఫ్ట్, పంప్‌హౌస్ ఇతర నిర్మాణాలు	ఏపీ
6) శ్రీశైలం ఎడమ విద్యుత్తు కేంద్రం	తెలంగాణ జెన్‌కో
7) కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, పంప్‌హౌస్, ఇతర నిర్మాణాలు	తెలంగాణ
నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోనివి	
8) నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వే, స్లూయిస్	తెలంగాణ
9) నాగార్జునసాగర్ మెయిన్ పవర్‌హౌస్	తెలంగాణ జెన్‌కో
10) నాగార్జునసాగర్ రైట్ కెనాల్, పవర్‌హౌస్	ఏపీ జెన్‌కో
11) సాగర్ రైట్ కెనాల్ హెడ్‌రెగ్యులేటర్	తెలంగాణ
12) సాగర్ లెఫ్ట్ కెనాల్ పవర్‌హౌస్	తెలంగాణ జెన్‌కో
13) సాగర్ లెఫ్ట్‌కెనాల్ హెడ్ రెగ్యులేటర్	తెలంగాణ
14) సాగర్ వరద కాలువ హెడ్‌రెగ్యులేటర్	తెలంగాణ
15) ఏఎమ్మార్పీ లిఫ్ట్ పంప్‌హౌస్, ఇతర నిర్మాణాలు	తెలంగాణ

కాంగ్రెస్ మార్క్ రాజకీయం షురూ

మొదటిపేజీ తరువాయి...

అధిష్ఠానం నుంచి అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్‌కు ఫోన్లు వచ్చాయి. కానీ, బుధవారం మధ్యాహ్నానికే సీన్ మారిపోయింది. అద్దంకి దయాకర్ స్థానంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను అధిష్ఠానం ఎంపిక చేసింది. మరో అభ్యర్థి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ పేరు కూడా రెండు రోజుల క్రితమే అనూహ్యంగా తెరపైకి వచ్చింది. ఈ పరిణామాలే రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకునే నిర్ణయాలకు సైతం అధిష్ఠానం వద్ద విలువ ఉండదని తేలిపోయిందని ఆ పార్టీ నేతలు నిట్టూరుస్తున్నారు.

చివరి నిమిషంలో చక్రం తిప్పిన అధిష్ఠానం?

ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా ఎన్నికవ్వడంతో వారు ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు వేర్వేరుగా ఎన్నికలు నిర్వహిస్తుండటంతో అసెంబ్లీలో తగిన మెజార్టీ కలిగిన అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనకు వెళ్లే ముందు ఢిల్లీలో అధిష్ఠానం పెద్దలను కలిసి మహేశ్‌కుమార్‌గౌడ్, అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించాలని ప్రతిపాదించారు. ఇందుకు అధిష్ఠానం నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించిందంటూ సీఎం తన సన్నిహితులకు సమాచారమిచ్చారు. అయితే సీఎం విదేశీ పర్యటనకు వెళ్లిన తరువాత ఢిల్లీలో సీన్ మారిపోయింది. సీఎం ప్రతిపాదించిన అద్దంకి దయాకర్ అభ్యర్థిత్వాన్ని కొనసాగిస్తూ, పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జోక్యంతో మహేశ్‌కుమార్‌గౌడ్ స్థానంలో ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌ను ఎంపిక చేసినట్టు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ మంగళవారం అద్దంకి దయాకర్, వెంకట్‌కు ఫోన్ చేసి నామినేషన్ పత్రాలు సిద్ధం చేసుకోవాల్సిందిగా సూచించినట్టు సమాచారం. ఒక్కో అభ్యర్థిని పది మంది ఎమ్మెల్యేలు ప్రతిపాదించే బాధ్యతను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అధిష్ఠానం అప్పగించింది. దీంతో ప్రతిపాదించే ఎమ్మెల్యేలను ఆయన బుధవారం సీఎల్పీ కార్యాలయానికి పిలిపించి వారితో సంతకాలు కూడా చేయించారు. గురువారం నామినేషన్లు దాఖలు